తైక్వాండో పోటీలకు ముగ్గురు ఏఎస్ఎన్ క్రీడాకారులు


కీడాకారులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: బాపట్ల జిల్లా అద్దంకిలో ఇటీవల జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల తైక్వాండో పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. కాలేజి క్రీడాకారులు బొక్కా హేమలత సౌమ్య బంగారు పతకం సాధించగా, చుక్కా కిరణ్‌కుమార్, మల్లోల మేరీప్రశాంతి రజత పతకాలు సాధించినట్టు కాలేజి వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ నల్లక శేషగిరిరావు తెలిపారు. వీరిలో చుక్కా కిరణ్‌కుమార్, బొక్కా హేమలత సౌమ్యలు జనవరి 3–12 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో గల గురునానక్‌దేవ్ విశ్వవిద్యాలయంలో జరగనున్న అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్టు చెప్పారు. శనివారం కాలేజిలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌లు క్రీడాకారులను అభినందించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్ శామ్యూల్

తెనాలిటౌన్: పట్టణ 13వ వార్డులోని ఆర్ఎస్ చర్చిలో శనివారం ఆర్ఎస్ ఫౌండేషన్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను పాస్టర్ పల్లె శామ్యూల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రతి రోజు బైబిల్ గ్రంథంలోని ఒక వాక్యంతో ముద్రించబడిన క్యాలెండర్ ఆత్మీయ మేలులకై ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని పాస్టర్ శామ్యూల్ తెలిపారు. కార్యక్రమంలో దైవసేవకురాలు పల్లె ఝాన్సీరాణి, ధనలక్ష్మి, కుమారి, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అండర్-18 బాలుర పోటీలు ప్రారంభం

- శాప్ రాష్ట్రస్థాయి పోటీలు తెనాలిలో ప్రారంభం
- హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: స్పోర్ట్స్ అసోసియేషన ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) అండర్–18 బాలుర రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో ఆరంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోటీలను ప్రారంభించారు. ప్రారంభ సభకు హ్యాండ్‌బాల్ లీగ్ పోటీల కన్వీనర్, కోచ్ కె.నాగరాజు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడా వ్యాప్తికి ప్రభుత్వం కృషిచేస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనే తొలిసారిగా తెనాలిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హ్యాండ్‌బాల్ అకాడమీ నడుస్తోందని గుర్తుచేశారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే తరహాలో అకాడమీలు ఏర్పాటుకు తెనాలి స్ఫూర్తి కాగలదన్నారు. క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలన్నారు. విద్యార్థి దశలోనే ఆసక్తి కలిగిన ఏదొక క్రీడలో సాధన చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మనిషి పరిపూర్ణ వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగిన క్రీడాకారులకు క్రీడా కోటాలో ఉద్యోగం లభించే అవకాశాలు ఉన్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన క్రీడాకారులకు నగదు పారితోషికాలను అందజేస్తున్నట్టు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని చెప్పారు. క్రీడల్లో రాణించే వారు చదువులోనూ ముందంజలో ఉంటారని తెలిపారు. స్టేడియం కమిటీ సభ్యుడు కొత్తమాసు ఆంజనేయులు, యార్డు కమిటీ సభ్యుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. లీగ్ కమ్ నాకవుట్ పద్ధతిలో ఆరంభమైన శాప్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో వివిధ జిల్లాల్నుంచి 16 జట్లు తలపడుతున్నాయి. తొలిరోజున ఏడు మ్యాచ్‌లు జరిగాయి. విశాఖపట్టణం, కర్నూలు, విజయనగరం, శ్యాప్ హ్యాండ్‌బాల్ అకాడమీ జట్లు లీగ్ దశలో ముందంజలో ఉన్నాయి. పోటీలు రెండోరోజైన ఆదివారం కొనసాగుతాయి.

ఐలవరంలో నగర సంకీర్తన


నగర సంకీర్తనకు స్వాగతం పలుకుతున్న భక్తులు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం పుష్య మాస, శుక్లపక్ష నవమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో నగర సంకీర్తనకు అపూర్వ ఆదరణ లభించింది. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) మహిళా కన్వీనర్ దీవి సుజాత ధనుర్మాస విశిష్టతను తెలియజేశారు. ఈ నెల 2వ తేదీ ముక్కోటి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఆ రోజు ఉపవాస దీక్షతో ఉండి స్వామి పూజ చేయడం వల్ల సంతాన భాగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వి.కోటేశ్వరరావు, కేబీవీ రమణ, ఫణితపు నాగులు, జి.జగన్‌మోహనరావు, పంచుమర్తి శంకరరావు స్వామి, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపాల్ హనుమంతరావు

నగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి అన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శనివారం బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బుచ్చియ్యచౌదరి మాట్లాడారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఇటీవల జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల పోటీల్లో బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించిందని తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి కళాశాల కీర్తిని ఇనుమడింపజేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోగినేని హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు నర్రా వెంకటకృష్ణ, పీఈడీ సాంబమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్‌లు పంపిణీ

రేపల్లె: పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో ఈ నెల 1వ తేదీ ఉదయం 10 గంటలకు కొత్త, పాత పెన్షన్‌లు పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోపిదేవి రాజీవ్ చేతుల మీదగా నిర్వహించే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పెన్షనర్‌లు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు ప్లేట్‌లు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్‌లు పంపిణీ చేస్తున్న గ్రామ సర్పంచ్ సుమతి

పెనుమర్రు(వేమూరు): పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని సర్పంచ్ కొక్కిల గడ్డ సుమతి చెప్పారు. పెనుమర్రు గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్లేట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుమర్రు గ్రామానికి చెందిన కొల్లిపర వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం చిన్నకుమార్తె రత్నకుమారి ఆర్థిక సహాయంతో ప్లేట్‌లు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబరు దొప్పలపూడి సులోచన, కొల్లిపర బేబిమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో జితేంద్ర, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

7న పూర్వ విద్యార్థుల సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో నాక్ పీర్ బృందం వస్తున్న సందర్భంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలకు మంచి గ్రేడ్ రావడానికి నిర్వహిస్తున్న సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొని సూచనలు చేయాలని కోరారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, ఏపీటీఎఫ్ సభ్యులు

కొల్లూరు: ఏపీటీఎఫ్ కొల్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు నేతృత్వంలో నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటం చేస్తూ సమస్యల పరిష్కారానికి పాటుపడటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ మండల అధ్యక్షుడు జి.మాలకొండయ్య, జనరల్ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ సీహెచ్ శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహాత్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

తెనాలిటౌన్: పట్టణ కొల్లావారి వీధిలోని మహాత్మ సేవాశాంతి ఆశ్రమంలో వృద్ధులకు రావి నూతల సాంబశివరావు జ్ఞాపకార్థం శనివారం అన్నదానం చేశారు. సాంబశివరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రకాష్, జి.సుబ్బారావు, కె.రాజ్యలక్ష్మి, కె.సాయిసురేంద్ర, కుమార్, టి.రాధ, గంజి ప్రసాద్, దేవిశెట్టి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

షిరిడిసాయి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ...

గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు శ్రీ వెంకటేశ్వరయోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో స్వర్గీయ విడియాల కోట బసవయ్య, నాగలింగమ్మల జ్ఞాపకార్థము సేవా కార్యక్రమం నిర్వహించారు. విడియాల రుద్రకుమార్ సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కఠెవరం మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థము సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అన్నదాత సుఖీభవ సభ్యులు, పలువురు యోగసభ్యులు పాల్గొన్నారు.

మూలపాలెం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం


మూలపాలెంలో చెరువు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: బాపట్ల మండలంలోని మూలపాలెం గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మూలపాలెం గ్రామంలో రూ.34 లక్షలతో నిర్మించతలపెట్టిన పనులకు శనివారం శంకుస్థాపనలు నిర్వహించారు. మూలపాలెం గ్రామంలో చెరువు మరమ్మతులకు రూ.16 లక్షలు, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.18.40 లక్షలు కేటాయించటం జరిగిందని తెలిపారు. మూలపాలెం గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయటానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మూలపాలెం గ్రామ సర్పంచ్ బొలిమేర అనిల్‌కుమార్, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, డ్వామా పీడీ శంకర్ నాయక్, ఎంపీడీవో రాధాకృష్ణ, డీఎల్‌డీపీఓ పులి శరత్‌బాబు, ఏఈపీఆర్ మోహనరావు, ఏపీవో కోటయ్యనాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యూటీషియన్ శిక్షణ



బ్యూటీషియన్ శిక్షణ పొందిన మహిళలు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ కోర్సు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేశారు. శిక్షణ పూర్తిచేసినవారు కొత్త సంవత్సరంలో తగిన ఉపాధిని పొందగలరన్న ఆశాభావాన్ని క్లబ్ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్ అన్నారు. అను బ్యూటీ క్లినిక్ నిర్వాహకురాలు అక్కినేని రమాదేవి, రోటరీ క్లబ్ సభ్యులు కన్నెగంటి మురళి, చేతన్‌రాజ్ కొఠారి, నితిన్ చాండ్‌న, పావులూరి రాంబాబు, శ్రీగిరీష్, జెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి


నినాదాలిస్తున్న సీఐటీయూ నాయకులు

రేపల్లె: కార్మిక సమస్యల పరిష్కారానికి భీమవరంలో జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో భీమవరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న ప్రచార జాత కార్యక్రమం శనివారం రేపల్లె పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల సాధనకు సభలు నిర్వహిస్తున్నామన్నారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు రమాదేవి, సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, రైస్ మిల్లు ముఠా, ఆటో, అంగన్‌వాడీ, ఆశ, సుమో డ్రైవర్స్, రిక్షా, భవన నిర్మాణ సంఘాలు, సీఐటీయూ నాయకులు కె.ఝాన్సీ, జె.ధర్మరాజు, డి.శ్రీనివాసరావు, డి.బుజ్జి, ఎం.శరత్‌బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వెలుగులు

నూతన సంవత్సరం వేడుకలకు చర్చిలు భారీ విద్యుత్ అలంకరణతో ముస్తాబైన తెనాలి మండలం కొలకలూరు ఆర్‌సీఎం చర్చి, తెలుగు బాప్టిస్ట్ చర్చిలు కనుల విందు చేస్తున్న దృశ్యం





ఎంపీ మోపిదేవి నూతన సంవత్సర శుభాకాంక్షలు



రేపల్లె: 2023వ సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులు, పాడి పంటలతో వర్థిల్లాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందోత్సాహాలు చిగురించాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాగింగ్ రహిత సమాజానికి కృషి చేయాలి

బాపట్ల: ర్యాగింగ్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్ఐ సింగయ్య పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ర్యాంగింగ్ చేసి ఎదుటివారి మనస్సును నొప్పించడం సరికాదన్న విషయం ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, అడ్వకేట్ ఆర్.వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు సాంబయ్య, రామిరెడ్డి, హరిబాబు, రాజ్‌కిరణ్, విజయకుమార్, లావణ్య, వినోద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జెడ్పీ స్కూల్ విద్యార్థి

యడ్లపల్లి(వేమూరు): చుండూరు మండలం యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో శనివారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి శివనాగరాజురెడ్డి ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శివనాగరాజురెడ్డిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వేమూరి శరత్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కొల్లూరు: వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శనివారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు, ఆప్కో చైర్మన్ మోహన్‌రావుతో కలసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైతం పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

తెనాలిఅర్బన్: 108 అంబులెన్స్‌లో పనిచేసే ఉద్యోగులకు భద్రత కల్పించడంతో పాటు జీతాల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ తెనాలి నాయకులు కోరారు. గంగానమ్మపేటలోని ఆయన కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు.

రేషన్ షాపుల్లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు

రేపల్లె రూరల్: పట్టణంలోని పలురేషన్ దుకాణాలను ఆర్డీవో జగన్నాథం పార్థసారథి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని 13, 16 నంబర్ల దుకాణాలను తనిఖీ చేసి, స్టాకు రికార్డులను పరిశీలించి, నిల్వ ఉన్న స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. 1వ తేదీ నుంచి రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆయా డీలర్లను ఆదేశించారు. ప్రతి నెల బియ్యం, కందిపప్పుతో పాటు పంచదార, ఇతర సరుకులకు తప్పనిసరిగా డీడీలు తీయాలని చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ విజయేంద్ర, సీఎస్ డీటీ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేటినుంచి పింఛనర్లకు జీవన ప్రమాణ పత్రాలు

తెనాలి: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పింఛనుదార్లు 2023 సంవత్సరానికి సమర్పించాల్సిన జీవన ప్రమాణ పత్రాల (లైవ్ సర్టిఫికెట్లు)ను స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ఆదివారం నుంచి ఉచితంగా ఇవ్వనున్నట్టు సంఘ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సదరు పత్రాలు కావాల్సినవారు తమతోపాటు ఆధార్ కార్డు, పీపీఓ నెంబరు, సీఎఫ్ఎంఎస్ నెంబర్, సెల్ ఫోనుతో సహా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. దీర్ఘవ్యాధులు, లేవలేనివారు, ఎక్కువ అంగవైకల్యం కలిగినవారుంటే, వారికి సంబంధించి బంధువులు రావొచ్చని తెలిపారు. ఉదయం 9–12 గంటలు, మధ్యాహ్నం 2–5 గంటల మధ్య కార్యాలయం పనివేళల్లో సంప్రదించవచ్చని వివరించారు.

వైభవంగా ధనుర్మాస వ్రతపూజలు

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామిజీ ఆధ్వర్యంలో శ్రీ ధనుర్మాస వ్రత పూజ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతినిత్యం మేలు కొలుపు, గోదా రంగనాధులకు అభిషేకములు, అష్టోత్తరశతనామార్చన, ఆరగింపు, తిరుప్పావై గోష్ఠి నిర్వహిస్తున్నారు. ధనుర్మాస విశిష్టతను బాలస్వామిజీ శనివారం భక్తులకు వివరించారు. ఉభయదాతలు దర్శి వెంకటనారాయణ, లక్ష్మీకాంతం దంపతులు, చక్కా కృష్ణప్రసాద్, మాధురి (విజయవాడ) దంపతులు, సోమిశెట్టి సత్యనారాయణ, నీలమ (హైదరాబాద్) దంపతులు పూజలు జరిపారు. బాలస్వామిజీ వ్రత మహోత్సవాల ప్రత్యేకతను భక్తులకు వివరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ప్రాధాన్యం

ఎమ్మెల్యే శివకుమార్


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి నుంచి గుంటూరుకు నూతనంగా ఏర్పాటు చేసిన రెండు పల్లెవెలుగు బస్సులను శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బస్సులోకి ఎక్కి పరిశీలించి దానిని నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించిదని, ఉద్యోగుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నట్లు వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు డిపో మేనేజర్‌తో మాట్లాడి గుంటూరుకు రెండు కొత్త సర్వీసులను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. అనంతరం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీఎం ఎ.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దారు నాంచారయ్య

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందెబాల చంద్రమౌళి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జి.నాంచారయ్య చేతుల మీదుగా ఆంగ్ల నూతన సంవత్సర కాలమాని(క్యాలెండర్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరికీ నూతన ఆంగ్ల సంవత్సరములో మంచి జరగాలని ఆకాంక్షించారు. అడ్వాన్స్ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డి బాలకృష్ణారెడ్డి , ప్రధాన కార్యదర్శి భీమవరపు మధుసూదనరెడ్డి, మండల అభివృద్ధి కార్యాలయం సూపరింటెండెంట్ వడ్లమూడి చంద్రమోహన్, ఆరోగ్యవిస్తరణాధికారి వంగర బుజ్జిబాబు, ఆరోగ్య సహాయకులు తుల్లిమిల్లి వెంకటేశ్వరరావు, ఆలా వేణుగోపాలరావు తదితరలు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపట్నం: విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని సర్పంచ్ పిట్టు లక్ష్మి తెలిపారు. ముత్తుపల్లి జెడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిట్టు లక్ష్మి మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బైజూస్ పాఠ్యాంశాలతో విద్యను అందించేలా ట్యాబ్‌లను అందించడం జరుగుతోందన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలన్నదే జగనన్న ఉద్దేశమన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి అన్ని వసతులను కల్పిస్తున్నారని చెప్పారు.

బ్రాహ్మణ పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండరును ఆవిష్కరిస్తున్న బ్రహ్మానందశాస్త్రి, నిర్వాహకులు

తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో వార్షిక క్యాలెండరును శనివారం సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. సభకు పెద్దిరాజు సత్యం అధ్యక్షత వహించారు. ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి క్యాలెండరు ఆవిష్కరణ చేశారు. ప్రాచీన కవుల విశేషాలతో దీనిని ముద్రించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు పైడిమర్రి లక్ష్మీనారాయణ, పరిషత్ సావనీర్ కమిటీ చైర్మన్ రాయప్రోలు జగదీష్‌చంద్రశర్మ, పరిషత్ అధ్యక్షుడు పరాశరం వెంకట రామగోపాల్, కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, వడ్లమాని ఉమామహేశ్వరరావు, త్రిపురారిభట్ల దత్తు, వంగల మాధవరావు, దావులూరి శ్యామసుందరశర్మ, దీవి జీవన్‌కుమార్, చెన్నాప్రగడ శ్రీనివాసరావు, లక్కరాజు లక్ష్మణరావు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం


పోతురాజు, మురళి, నాగభూషణంలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం సాయంత్రం ప్రముఖ రంగస్థల కళాకారుడు అంబటి పోతురాజును ఘనంగా సన్మానించారు. అనంతరం ఎన్టీఆర్ రీమెక్ చిత్రాలు– సూపర్‌హిట్స్ అనే అంశంపై గోనుగుంట్ల మురళి, కంచర్ల నాగభూషణంలు ప్రసంగించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాడిబోయిన హరిప్రసాద్, కాకుమాను రాంబాబు, అలపర్తి వెంకటేశ్వరరావు, గోళ్ళ ప్రభుదాసు, కంచర్ల చంద్రశేఖర్, గిరి, కంచర్ల ఏడుకొండలు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, వెనిగళ్ళ శివన్నారాయణ ప్రసాద్, తిరుపతిరావు, దీపక్, దేవిశెట్టి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.